సాక్షి నంద్యాల

శుక్రవారం ׀ 15 ׀ మార్చి ׀ 2024



కల..సాకారం

బనగానపల్లె నియోజకవర్గ ప్రజల కల సాకారమైంది. పట్టణంలో రూ.22 కోట్లతో వందపడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయింది. ఈ ఆసుపత్రి శిలాఫలకాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారు.



నాన్నే స్ఫూర్తి

బనగానపల్లె ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన సభావేదికపై వైఎస్సార్ విగ్రహానికి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.



వెల్లి'విరి'సిన ఆనందం

బనగానపల్లె పట్టణంలో సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు అక్కచెల్లెమ్మలు భారీగా తరలివచ్చారు. అభిమాన నేతకు దారిపొడవునా పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

18 నుంచి ఒంటిపూట బడులు

- పది పరీక్ష కేంద్రాలుగా ఉన్న స్కూళ్లకు సెలవులు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 18వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన స్కూళ్లకు ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈఓ సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిపూట బడులు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పదోవ తరగతి పరీక్షలు జరగనున్నాయని, ఈ పరీక్షలకు కేంద్రాలుగా ఉన్న పాఠశాలలకు పరీక్షలు జరిగే రోజుల్లో సెలవు ప్రకటించినట్లు తెలిపారు. సెలవులు ప్రకటించిన స్కూళ్లు ఈనెల 24, 31, ఏప్రిల్ 7, 13, 14, 21 తేదీలలో తప్పనిసరిగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా స్థానిక గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల సహకారంతో ప్రతి పాఠశాలలో తాగునీటి వసతి ఏర్పాటు చేసుకోవాలని, వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పాఠశాలలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు. స్కూళ్లలో ఎవరైనా వాలంటరీ ఆర్గనైజేషన్ ద్వారా విద్యార్థులకు మజ్జిగ సరఫరా చేసే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత జగనన్న గోరుముద్ద పథకాన్ని తప్పక అందించాలన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

నంద్యాల టౌన్: పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రజియా సుల్తానా తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ పరీక్షలు రాసే విద్యార్థులకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో తమ సమీపంలోని స్టేజి నుంచి పరీక్ష కేంద్రం వరకు, తిరిగి పరీక్ష కేంద్రం నుంచి తమకు సమీపంలోని స్టేజి వరకు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ప్రయాణ సమయంలో హాల్ టికెట్ తప్పక చూపించాలన్నారు. పరీక్ష జరిగే రోజుల్లో మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు.

శాస్త్రోక్తంగా సెల్వర్ కుత్తు ఉత్సవం



ఉత్సవంలో వేదాలు వల్లిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: ఈనెల 15వ తేదీ నుంచి అహోబిలేశుని బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం ఎగువ అహోబిలంలో సెల్వర్ కుత్తు ఉత్సవం శాస్త్రోక్తంగా చేపట్టారు. ఉదయం జ్వాలా నారసింహుడికి నిత్య పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవమూర్తిని ఉత్సవ పల్లకీలో కొలువుంచి దేవాలయం ఎదురుగా ఉన్న ధ్వజ స్తంభం వద్దకు తోడ్కొని వచ్చారు. వేద పండితులు వేద మంత్రోచ్చారణలతో సెల్వర్ కుత్తు ఉత్సవం నిర్వహించారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్మీడియెట్ థియరీ మొదటి సంవత్సర ప్రధాన పరీక్షలు గురువారంతో ముగిశాయి. జిల్లాలో ఈ నెల 1వ తేదీ నుంచి 52 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు మొదలయ్యాయి. ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలను ప్రాంతీయ కార్యాలయ అధికారులు పక్కగా అమలు చేశారు. ప్రధాన పరీక్షలు అన్ని ముగియంతో ఫస్టియర్ విద్యార్థులు కేంద్రాల దగ్గర సంతోషంతో గెంతులు వేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. చివరి రోజు జరిగిన పరీక్షకు 14,881 మంది విద్యార్థులకుగాను 14,070 మంది హాజరుకాగా.. 811 మంది గైర్హాజరయ్యారు.



ఈబీసీ నేస్తం నిధులను బటన్ నొక్కి విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్



సెంట్రల్ లా వర్సిటీ భవన సమూనాలను పరిశీలిస్తున్న సీఎం, మంత్రి, ఎమ్మెల్యేలు



సెంట్రల్ లా వర్సిటీ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేలు, ప్రముఖులు

న్యాయాన్ని గెలిపిద్దాం సంక్షేమాన్ని కాపాడుదాం

సీమ ముఖద్వారం మురిసిపోయింది..

రేనాటి గడ్డ పులకించింది.. జన సంద్రం ఉప్పెనలా ఎగిసిపడింది.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. 'జయ' ధ్వానాల మధ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి భూమి పూజ జరిగింది. జై జగన్ నినాదాలతో ఈబీసీ నేస్తం పథకం నిధుల విడుదల కార్యక్రమం హోరెత్తింది. రాయలసీమ వాసుల ఆకాంక్షను నెరవేర్చేలా సీఎం జగన్ చేసిన ప్రసంగం ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది. నయవంచకులను నమ్మొద్దని, ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరినప్పుడు భారీ స్పందన లభించింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష ప్రజలందరిలోనూ కనిపించింది.

- వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్ గెలవాలని ఆకాంక్షించిన జనం
- కర్నూలు, బనగానపల్లెలో జననేతకు అపూర్వ స్వాగతం
- రేనాటిగడ్డలో పూలు చల్లుతూ అభిమానం చాటుకున్న మహిళలు
- కర్నూలులో 'జై జగన్' అంటూ నినదించిన న్యాయవాదులు
- నూతనోత్తేజం నింపిన ముఖ్యమంత్రి ప్రసంగాలు
- జనహోరు మధ్య ఈబీసీ నేస్తం నిధుల విడుదల
- హర్షధ్వానాలతో సెంట్రల్ లా వర్సిటీకి శంకుస్థాపన



కర్నూలులో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే కర్నూలులో లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా.

అక్కచెల్లెమ్మలు బాగుంటే వారి కుటుంబాలు కూడా బాగుంటాయి. సంక్షేమ పథకాల్లో సింహభాగం నా అక్కచెల్లెమ్మలకు అందిస్తున్నాం. ఎక్కడా లంచాలు, వివక్షతకు చోటు లేకుండా నేరుగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం మనది. మీ ఇంటికి మంచి జరిగి ఉంటే మీరే సైనికుల్లా, స్టార్ క్యాంపెయినర్లుగా మీ బిడ్డకు అండగా ఉండండి.

– సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, నంద్యాల/కర్నూలు(సెంట్రల్): జనం..జనం.. ప్రభంజనం.. తమ అభిమాన నేత సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కళ్లారా చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో బనగానపల్లె పట్టణం జనసంద్రాన్ని తలపించింది. ఏవైపు చూసినా కనుచూపు మేర జనసందోహమే కనిపించింది. ఈబీసీ నేస్తం లబ్ధిదారులకు మూడో విడత బటన్ నొక్కి ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బనగానపల్లెకు వచ్చారు. కనీవినీ ఎరుగనిరీతిలో ప్రజాప్రతినిధులు, అభిమానులు, మహిళలు, కార్యకర్తలు జననేతకు స్వాగతం పలికారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది.

అభిమానుల్లో జోష్..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగానికి మహిళలు, యువత నుంచి భారీ స్పందన వచ్చింది. ఆయన మాట్లాడుతున్నంత సేపు ప్రజలు శ్రద్ధగా విన్నారు. ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తూనే... ప్రతిపక్షాలపై పంచ్‌లతో సీఎం జగన్ ఆకట్టుకున్నారు. పచ్చి మోసగాళ్లు, దగాకోర్లు, నయవంచకులైన వారిని పొరపాటున కూడా నమ్మొద్దని సీఎం చేసిన విజ్ఞాపనకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చింది. నయవంచకుడైన చంద్రబాబును నమ్మమంటూ సభకు వచ్చిన ప్రజలంతా రెండు చేతులు ఎత్తి గట్టిగా అరుస్తూ చెప్పారు. 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన రైతు రుణమాఫీని గత టీడీపీ ప్రభుత్వం అమలు చేసిందా అన్న సీఎం ప్రశ్నకు ప్రజల నుంచి 'లేదు లేదు' అంటూ సమాధానం వచ్చింది. డ్వాక్రా రుణాలు మాఫీ చేశారా అని అడిగితే అస్సలు చేయలేదంటూ మహిళలు పెద్ద ఎత్తున నినదిస్తూ సమాధానం ఇచ్చారు. పవన్ కల్యాణ్‌ని ఉద్దేశిస్తూ మ్యారేజ్ స్టార్ అన్న సందర్భంలో యువతలు విజిల్స్ వేసి తమ మద్దతు తెలిపారు. 'రంగు రంగుల మ్యానిఫెస్టోతో మళ్లీ గజదొంగల ముఠా మీ ముందుకు వస్తుంది.. కేజీ బంగారం, ఇంటికొక బెంజి కారు ఇస్తామని చెబుతారు.. మీరు నమ్ముతారా' అని ప్రజలను అడుగగా నమ్మం అంటూ ప్రజలంతా రెండు చేతులు పైకెత్తి సమాధానం ఇచ్చారు.

మార్మోగిన సభా ప్రాంగణం

బనగానపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఉదయం 10 గంటలకే ప్రజలతో కిక్కిరిసింది. సభా వేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



అభిమాన నేతకు వందనం

కర్నూలులోని జగన్నాథగట్టులో నేషనల్ లా యూనివర్సిటీకి శంకుస్థాపన చేసిన అనంతరం సీఎం వైఎస్ జగన్ హెలికాప్టర్‌లో ఉదయం 11 గంటలకు బనగానపల్లెకు చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ వేదిక వద్దకు బయలుదేరగా.. మహిళలు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు దాదాపు మూడు కిలోమీటర్ల మేర పూలు చల్లుతూ తమ అభిమాన నేతకు ఆత్మీయ స్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వద్దకు చేరుకునేందుకు దాదాపు 45 నిమిషాల సమయం పట్టింది. జననేత జగన్ వేదిక మీద అడుగుపెట్టగానే విజిల్స్, చప్పట్లు, కేరింతలతో సభా ప్రాంగణం మార్మోగింది. సీఎం సీఎం సీఎం అంటూ మహిళలు, యువత పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రజల కోలాహలం మధ్య దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఈబీసీ నేస్తానికి సంబంధించిన ఏవీ ప్రదర్శించారు.

అనంతరం నంద్యాల జిల్లా కలెక్టర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతీ లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందజేస్తోందని చెప్పారు. రెడ్డి, కమ్మ, క్షత్రియ, ఆర్యవైశ్య తదితర అగ్రవర్ణ కులాలలో ఆర్థికంగా వెనకబడిన మహిళలకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తోందన్నారు. గత రెండు విడతల్లో నంద్యాల జిల్లాకు సంబంధించి 29,330 మందికి రూ.43.98 కోట్ల మేర ఆర్థిక సాయం అందిందని, మూడో విడతలో భాగంగా గురువారం 17,652 మందికి రూ.26 కోట్ల మేర ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

ఘన స్వాగతం

జగన్నాథగట్టులో నేషనల్ లా యూనివర్సిటీ పనులకు శ్రీకారం చుట్టిన అనంతరం హెలికాప్టర్‌లో సీఎం జగన్ బనగానపల్లెకు చేరుకున్నారు. హెలిప్యాడ్ దగ్గర సీఎం జగన్‌కు నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా రవి చంద్రకిశోర్ రెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నందికొట్కూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దారా సుధీర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, యువనేత కాటసాని ఓబుళ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు.

కాటసానిని భారీ మెజార్టీతో గెలిపించండి

వచ్చే ఎన్నికల్లో బీసీ జనార్దన్‌రెడ్డి ఇచ్చే రూ. 2 వేలు లేదా రూ.3 వేలు తీసుకొని ఓటు మాత్రం కాటసాని రామిరెడ్డికి వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బనగానపల్లె బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీసీ జనార్దన్‌రెడ్డి పెద్ద ధనవంతుడని, ఆయనకు పేదల కష్టాలు తెలియవన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు పేదోడి పవర్ తెలియాలంటే కాటసాని రామిరెడ్డికి ఓటు వేసి గెలిపించాలన్నారు. 'పేదవాడి భవిష్యత్తు మారాలన్నా, అవ్వాతాతలకు పెన్షన్ ఇంటికే వచ్చి ఇవ్వాలన్నా, అక్కాచెల్లమ్మల పిల్లల చదువులు కొనసాగాలన్నా, రైతన్నల మోములో చిరునవ్వు కనిపించాలన్నా, వ్యవసాయం పండుగ కావాలన్నా.. ఏమి జరుగాలన్నా మీ బిడ్డ జగన్ సీఎం కావాలని, జగన్ సీఎం కావాలంటే రామిరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందాలి' అని అన్నారు. మీరు బటన్ సరిగా నొక్కకపోతే వలంటీర్లు ఉండరని, జన్మభూమి కమిటీలు వచ్చి వివక్ష అలుముకుంటుందన్నారు. పేదల బతుకులు, చదువులు అవిరైపోతాయన్నారు. వీటిన్నింటిని దృష్టిలో ఉంచుకొని వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ముఖ్యమంత్రి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



కాటసాని రామిరెడ్డిని గెలిపించాలని సభావేదిక నుంచి కోరుతున్న సీఎం జగన్

రోజంతా బిజీగా సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రోజంతా ప్రజా కార్యక్రమాలతో బిజీగా గడిపారు. ఒకేరోజు కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పర్యటన చేశారు. గన్నవరం విమానాశ్రయం నుంచి విమానంలో ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు ఉదయం 9.35 గంటలకు చేరుకున్నారు. అనంతరం హెలికాప్టర్‌లో 9.50 గంటలకు కర్నూలులోని జగన్నాథగట్టుకు వచ్చి జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి భూమి పూజ చేసి ప్రసంగించారు. అనంతరం నంద్యాల జిల్లా బనగానపల్లెలో జరిగిన ఈబీసీ నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. 4.19లక్షల మంది అగ్రవర్ణ పేద మహిళల ఖాతాల్లో రూ.629కోట్లు జమ చేశారు. అనంతరం బనగానపల్లె నుంచి అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనుకొండ్లకు వెళ్లారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఆదోని, మంత్రాలయం, గుంతకల్లు ఎమ్మెల్యేలు వై.సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకటరామిరెడ్డి తల్లి ఎల్లారెడ్డి లలితమ్మ అంత్యక్రియల్లో పాల్గొని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను ఓదార్చారు. అనంతరం సాయంత్రం 4.10 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు నుంచి విమానంలో గన్నవరం వెళ్లారు.



జనహోరు: బనగానపల్లె సభకు భారీగా తరలివస్తున్న ప్రజలు



మా నమ్మకం నీవే.. సభలో సీఎం వైఎస్ జగన్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళలు

మళ్లీ మీరే గెలవాలి.. సీమకు న్యాయం చేయాలి

- నినదించిన న్యాయవాదులు
- సెంట్రల్ లా వర్సిటీకి భూమి పూజ చేసిన సీఎం వైఎస్ జగన్

'మళ్లీ మీరే గెలవాలి..మీరే రాయలసీమకు న్యాయం చేయాలి' అంటూ న్యాయవాదులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జై జగన్ అంటూ సభా ప్రాంగణాన్ని హోరెత్తించారు. రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు కావాలంటే మళ్లీ వైఎస్ఆర్‌సీపీ ఎన్నికల్లో గెలవాలని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేయాలని ఆకాంక్షించారు. లేదంటే అమరావతి బూచిని చూపి సీమకు అన్యాయం చేస్తారని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలులోని జగన్నాథగట్టుపై ఏర్పాటు చేయబోతున్న జాతీయ న్యాయ విశ్వ విద్యాలయానికి భూమి పూజచేయడానికి గురువారం ఉదయం 9.35 గంటలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు చేరుకున్నారు. అక్కడ ఆయనకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన, కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎఎండీ ఇంతియాజ్, కోడుమూరు మాజీ ఎమ్మెల్యేలు మదనగోపాల్, మురళీకృష్ణ, అదనపు ఎస్పీ నాగరాజు, కర్నూలు ఆర్డీఓ ఎం.శేషిరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం సీఎం హెలికాప్టర్‌లో జగన్నాథగట్టులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు 9.57 గంటలకు చేరుకున్నారు. అక్కడ సీఎంకు కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్రమానవ హక్కుల కమిషన్ సభ్యులు జి.శ్రీనివాసరావు, కర్నూలు , కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, డాక్ట్ జే.సుధాకర్, చెన్నకేశవరెడ్డి, కంగాటిశ్రీదేవి, జేసీ నారపురెడ్డి మౌర్య, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కర్నూలు నగరమేయర్ బీవై రామయ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, డీసీఎంఎస్ చైర్మన్ శిరోమణి మద్దయ్య, గోశాల చైర్మన్ ఆదిమోహన్‌రెడ్డి, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు బుట్టా రేణుక, డాక్టర్ ఆదిమూలపు సతీష్, బి.వి రూపాక్షి, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, వైఎస్ఆర్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి స్వాగతం పలికారు. బార్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం నాయుడు, ఎంపీ చక్రపాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు రవిగువేరా, మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ తదితరులు పాల్గొన్నారు.



జగన్నాథగట్టులో సెంట్రల్ లా వర్సిటీ శిలాఫలకం వద్ద న్యాయవాదులు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:31	ఉ॥ 5:02
ఆదోని	సా॥ 6:34	ఉ॥ 5:05
నంద్యాల	సా॥ 6:31	ఉ॥ 4:59
ఆత్మకూరు	సా॥ 6:29	ఉ॥ 5:00
బనగానపల్లె	సా॥ 6:32	ఉ॥ 5:00

రంజాన్ వేళలు

హదీస్ వెలుగు :

రంజాన్ ఉపవాస దీక్షలకు భంగం కలుగకుండా చంద్ర దర్శనమైన మరుక్షణమే సైతాన్‌ను అల్లాహ్ ఖైదు చేసి ఉంచుతారు. ఈ మాసంలో రోజా, నమాజు, జికర్, జకాత్, ఆధ్యాత్మికతపై అధిక దృష్టి పెట్టండి. – పవిత్ర ఖురాన్

క్లుప్తంగా

డీఎఫ్‌ఓ బాధ్యతల స్వీకరణ



డీఎఫ్‌ఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యామల

కర్నూలు కల్చరల్: జిల్లా అటవీ శాఖ అధికారిణిగా పుడిగోసుల శ్యామల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎఫ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న పి. శివశంకర్‌రెడ్డి స్థానంలో ఆమె నియమితులయ్యారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గంకు చెందిన ఈమె 2010 అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (ఏసీఎఫ్) గా బెల్లంపల్లిలో నియమితులయ్యారు. 2015 నుంచి 2022 వరకు అటవీ శాఖ హెడ్ ఆఫీస్ (పీసీఎఫ్) కార్యాలయంలో విధులు నిర్వహించారు. 2022లో పుట్టపర్తి జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌ఓగా బదిలీ అయ్యారు. గత నెలలో ఐఎఫ్‌ఎస్ శిక్షణ పూర్తి చేసుకోవడంతో కర్నూలు డీఎఫ్‌ఓగా బదిలీ అయ్యారు. దీంతో పాటు సోష్కడ్ డీఎఫ్‌ఓగా విధులు నిర్వహించనున్నారు.

పీజీ పరీక్షలకు 92 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా గురువారం 92 శాతం మంది హాజరయ్యారు. ఆర్‌యూతో పాటు నందికొట్కూరు,నంద్యాల, ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఆదోని జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 543 మంది విద్యార్థులకు గాను 499 మంది హాజరయ్యారని, 44 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వెంకటేశ్వర్లు తెలిపారు.

వ్యవసాయ కళాశాల ఏడీగా విజయలక్ష్మి




బాధ్యతలు స్వీకరిస్తున్న విజయలక్ష్మి

మహానంది: మహానంది ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ వి.విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్న ఆమె వ్యవసాయ కళాశాల తొలి మహిళా అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున డాక్టర్ కెఎస్ఎస్ నాయక్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌కు టెక్నికల్ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఆయనతో పాటు వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విస్తరణ విభాగం హెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంఎస్ రాహుల్ గుంటూరు లాంఫాంకు బదిలీ అయ్యారు. మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ సంతోష్‌నాయక్ తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాలకు బదిలీ అయినట్లు కళాశాల కార్యాలయ వర్గాలు తెలిపాయి.

చే'నేత'ను వంచించి..

- ఎమ్మిగనూరులో చేనేతలకు మొండి చేయి చూపిన చంద్రబాబు
- మాచాని సోమప్ప కుటుంబానికి అవమానం
- ఖంగుతిన్న 'కోట్ల' వర్గం
- టీడీపీ అభ్యర్థిగా జయనాగేశ్వరరెడ్డి



ఎమ్మిగనూరు: చేనేత వర్గాన్ని తెలుగుదేశం పార్టీ మోసం చేసింది. ఎమ్మిగనూరు అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ చేనేతలకు ఇస్తామని చెప్పి వంచించింది. పద్మశ్రీ మాచాని సోమప్ప మునిమనవడు డాక్టర్ సోమనాథ్‌కు అవకాశం ఇస్తామని చెప్పిన టీడీపీ పెద్దలు మాట తప్పారు. టీడీపీ గురువారం ప్రకటించిన రెండో జాబితాలో చేనేతల ప్రస్తావనే లేదు. దీంతో ఆ వర్గీయులు మండిపడుతున్నారు. మాచాని సోమప్ప కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారని, తగిన బుద్ధి చెబుతామని బహాటంగానే ప్రకటిస్తున్నారు. అధికార వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని ఒప్పించి బీసీ వర్గానికి చెందిన చేనేత మహిళ, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్టారేణుకను ఎమ్మిగనూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. తెలుగుదేశం పార్టీ కూడా ఎమ్మిగనూరు స్థానాన్ని బీసీలకే కేటాయించే ఆలోచన చేస్తోందంటూ రాబిన్ శర్మ టీం, ఐటీడీపీ వర్గాలు ఆశలు చూపాయి. బీసీ వర్గానికి చెందిన కొంగతి లక్ష్మినారాయణ, మాచాని సోమనాథ్, చోళ మల్లికార్జునలను మూడు నెలలుగా ప్రచారానికి టీడీపీ వాడుకొని వదిలేసింది. పద్మశ్రీ మాచాని సోమప్ప మనవడు డాక్టర్ సోమనాథ్‌ను తీవ్రంగా అవమానించింది. టీడీపీ రాష్ట్ర కార్యాలయం నుంచే ఆపార్టీ పెద్దలు సోమనాథ్‌తో వివిధ కార్యక్రమాలు నిర్వహింపజేసి ఆర్థికంగా నష్టపర్చటమే కాకుండా ఎమ్మిగనూరులో సోమప్ప కుటుంబం పరువును తీశారని చేనేతలు మండి పడుతున్నారు. తెలుగుదేశం పార్టీకి సోమప్ప కుటుంబం ఎన్నో సేవలు చేసిందని, పట్టణాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించిన కుటుంబం పట్ల ఇలా వ్యవహరించటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డిని డాక్టర్ సోమనాథ్ పల్లెత్తుమాటకూడా అనకుండా తన ప్రచారం తను చేసుకొన్నారని, అదే జయనాగేశ్వరరెడ్డి మాత్రం తనకు టికెట్ రాకుండా చేసేందుకు చేనేతల తాతలు, ముత్తాతలు దిగిరావాలని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని గుర్తు చేస్తున్నారు. ఆత్మగౌరవమున్న చేనేతలెవరూ జయనాగేశ్వరరెడ్డికి మద్దతు ఇవ్వరని తెలిపారు. మాచాని సోమప్ప కుటుంబ సభ్యుల పట్ల టీడీపీ వ్యవహరించిన తీరును పట్టణ ప్రజలు జీర్ణించుకోలేకున్నారు.

'కోట్ల' వర్గానికి కుంగుబాటు

టీడీపీ తరఫున ఎమ్మిగనూరు నియోజకవర్గ అభ్యర్థిగా మాచాని సోమనాథ్‌ను నిలబెట్టాలని మాజీ కేంద్ర మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయితే టీడీపీ ప్రకటించిన రెండవ జాబితాతో ఆయన వర్గీయులు ఖంగుతున్నారు. ఆలూరు నియోజకవర్గం నుంచి కోట్ల సతీమణి సుజాతమ్మ పేరు ప్రకటించకపోవడం, ఎమ్మిగనూరులో మొదటినుంచి తన వర్గాన్ని అణగదొక్కుతూ, అవమానాలకు గురిచేస్తున్న జయనాగేశ్వరరెడ్డినే టీడీపీ అభ్యర్థిగా ప్రకటించటం సూర్యప్రకాష్‌రెడ్డితోపాటు ఆయన వర్గీయులను కుంగదీసింది. మూడు నెలలుగా సోమనాథ్‌కు మద్దతుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఎన్నికల ప్రచారాలు కూడా చేసిన కోట్ల వర్గీయుల్లో ఆందోళన మొదలైంది. మళ్లీ జయనాగేశ్వరరెడ్డి వల్ల తమకు ఇబ్బందులు తప్పవని, అవసరమైతే సోమనాథ్‌తో ఇండిపెండెంట్‌గా పోటీ చేయిస్తామంటూ కోట్ల వర్గీయులు అంటున్నారు.

తిక్కారెడ్డికి వెన్నుపోటు

- కోసిగిలో టైర్లు కాల్చి నిరసన తెలిపిన అనుచరులు

మంత్రాలయం: మంత్రాలయం నియోజకవర్గం ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కంచుకోట. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి టీడీపీని వీడిన తర్వాత పార్టీకి నాయకత్వం కరువైంది. ఇక పార్టీ ఉనికి కష్టమైన తరుణంలో పాలకుర్తి తిక్కారెడ్డి పార్టీ బాధ్యతలు చేపట్టారు. టీడీపీ క్యాడెర్, కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ కోసం శక్తివంచన లేకుండా శ్రమించారు. దాదాపు 12 ఏళ్లుగా పార్టీ మనుగడకు తనవంతు కృషి చేశారు. 2014 ఎన్నికల ప్రచారంలో భాగంగా మనుపెన్నడూ లేనివిధంగా, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి పట్టున్న రాంపురం, కాచాపురం, తుంగభద్ర గ్రామాల్లోనూ ప్రచారం గావించారు. 2019 ఎన్నికల్లోనూ ఖగ్గల్ గ్రామంలో ప్రవేశించగా సొంత గన్‌మెన్ల కాల్పుల్లో కాలితొడ భాగంలో బుల్లెట్లు దిగి గాయపడ్డారు. గాయాలను లెక్క చేయకుండా స్ట్రెచర్ పైనే ఎన్నికల ప్రచారం కూడా చేశారు. పార్టీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. దాదాపు పన్నెండేళ్లు శ్రమించినా పార్టీ అధిష్టానం ఈసారి తిక్కారెడ్డికి టిక్కెట్ కేటాయించలేదు. ఆయనకు తీరని అన్యాయం జరగడంతో పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఎగసి పడుతున్నాయి. చంద్రబాబు నిర్ణయంపై అనుచరవర్గం మండిపడుతున్నారు. పార్టీని నడిపించిన తిక్కారెడ్డికి కాకుండా నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన ఎస్.రాఘవేంద్రరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంపై ఆందోళనకు దిగారు. కోసిగి మండల కేంద్రంలో తిక్కారెడ్డి అనుచరులు టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు.

అనుమానం.. ఆందోళన

- ఆదోని టీడీపీ నేత మీనాక్షికి టికెట్ లేదనే ప్రచారంతో కార్యకర్తల ఆగ్రహం



మేజర్ పంచాయతీ మండిగిరిలో టీడీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేసిన టీడీపీ కార్యకర్తలు

ఆదోనిరూరల్: తెలుగు దేశం పార్టీలో టికెట్ల పంచాయతీ రగడ తారా స్థాయికి చేరుకుంటోంది. ఆ పార్టీ అధిష్టానం గురువారం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేసింది. కర్నూలు జిల్లా పరిధిలో 8 స్థానాలు ఉండగా మొదటి జాబితాలో నాలుగు స్థానాలను, రెండో జాబితాలో రెండు స్థానాల అభ్యర్థులను ప్రకటించింది. ఆలూరు, ఆదోని స్థానాలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఆదోని స్థానాన్ని కూటమిలోని బీజేపీకి కేటాయిస్తున్నారని నియోజకవర్గ టీడీపీ శ్రేణులు అనుమానిస్తున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మీనాక్షి నాయుడుకు ఇక టికెట్ దక్కదనే అనుమానంతో ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో పార్టీ అధినేత చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి మేజర్ పంచాయతీ మండిగిరిలోని రాజీవ్‌గాంధీనగర్ కాలనీకి వెళ్లే ప్రాంతంలో టీడీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేశారు. తమ నాయకుడికి అన్యాయం చేస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేహమే దేవాలయం.. జీవుడే దేవుడు



సూర్య ప్రభ వాహన సేవలో పాల్గొన్న త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ



వేడుకల్లో పాల్గొన్న భక్తులు

- త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ

కర్నూలు కల్చరల్: దేహమే దేవాలయం జీవుడే దేవుడని తెలుసుకొని జీవించడమే ఉత్తమ మానవ ధర్మమని త్రిదండి చిన్న జీయర్ స్వామీజీ భక్తులకు ఉపదేశించారు. కర్నూలు శివారులోని గోదా గోకులంలో వెలసిన శ్రీ గోదా దేవి సమేత రంగనాథస్వామి దేవస్థానంలో చేపట్టిన వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం ఆయన హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భక్తులందరికీ తీర్థ గోష్ఠి, ఉత్సవ వరులకు స్నపన తిరుమంజనం, చతుస్థానార్చన హోమం, నివేదన, పూర్ణాహుతి, బలి ప్రదానం, శాత్తుమొర, తీర్థ ప్రసాద వినియోగం, స్వామివారికి సూర్య ప్రభ వాహన సేవ, శ్రీమన్నారాయణాచార్య స్వామి యాజ్ఞికత్వంలో అర్చకులు రమేష్ భట్టర్, కిరణ్ భట్టర్ బృందం ఈ క్రతవులు నిర్వహించారు. వేడుకల్లో కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయ మనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, టీడీపీ నేత టీజీ భరత్, పారిశ్రామిక వేత్త టీజీ శివరాజ్, జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసులు దంపతులు, వీహెచ్‌పీ రాష్ట్రాధ్యక్షులు నందిరెడ్డిసాయి రెడ్డి, సహ కార్యదర్శి ప్రాణేష్, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, కార్యదర్శి భాను ప్రకాష్, ఆవోపా చీఫ్ కన్వీనర్ నాగేశ్వరరావు, రత్న ప్రసాద్ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో పీఠాధిపతులు అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, బృందావన రామానుజ జీయర్ స్వామి, ప్రయాగ్ రాజ్ రాఘవ ప్రసన్న జీయర్ స్వామి, గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, బాల సుధాకర్, భూమా కృష్ణమోహన్‌తో పాటు గోదాగోకులం పరివారం పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేద మహిళల ఆర్థిక ఉన్నతికి 'ఈబీసీ నేస్తం'

- మూడో విడత 6,944 మందికి రూ.10.41 కోట్ల లబ్ధి



మెగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న డీఆర్‌ఓ మధుసూదన్‌రావు

కర్నూలు(అర్బన్): అగ్రవర్ణ పేద మహిళల ఆర్థిక ఉన్నతికి రాష్ట్ర ప్రభుత్వం ఈబీసీ నేస్తం పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి కే మధుసూదన్ రావు అన్నారు. ఈ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా 3వ విడతగా 6,944 మంది రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, క్షత్రియ, వెలమ తదితర అగ్రవర్ణ కులాలకు చెందిన మహిళల ఖాతాల్లోకి రూ.10.41 కోట్లు జమ అయ్యాయన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకం 3వ విడత నిధులను నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి బటన్ నొక్కి విడుదల చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా లబ్ధిదారులతోపాటు అధికారులు, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ జీడీ కల్పన, బీసీ కార్పొరేషన్ ఏఈఓ జాకీర్‌హుసేన్ తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా 45 ఏళ్ల నుంచి 60 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న అర్హులైన అగ్రవర్ణ పేద మహిళలకు ఏడాదికి రూ.15 వేల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తోందన్నారు. మూడో విడతకు సంబంధించి రూ.10.41 కోట్ల మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు.

కుట్రల కూటమికి బుద్ధి చెప్పండి

- మంచికి పట్టం కట్టండి
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



బేతంచెర్లలో వాల్మీకి భవన్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: కోట్ల, కేఈల ఫ్యాక్షన్ రాజకీయాలతో డోన్ నియోజకవర్గంలో 200 మంది అమాయకులు బలయ్యారని, అధికారం కోసం అలాంటి వారు కలసిపోయారని, కుట్రల కూటమికి బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన 1.50 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన వాల్మీకి కమ్యూనిటీ భవనాన్ని వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి , వాల్మీకి సోదరులతో కలిసి ఆర్థిక శాఖ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సామరస్యంగా జనంతో మమేకం కాకుండా వారి మధ్య చిచ్చు పెట్టి కేఈ, కోట్ల పబ్బం గడుపుకున్నారన్నారు. అప్పట్లోనే ఐక్యత చాటి ఉంటే 100 కుటుంబాలు ప్రశాంతంగా బతికేవి కాదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షాల అర్థం లేని బెదిరింపులకు చిన్నపిల్లలు కూడా భయపడబోరన్నారు. గూటుపల్లె పరిసర గ్రామాల్లో జీపు మీద తుపాకి పెట్టి జనాలను భయపెట్టిన నాయకులు.. ఆ అభివృద్ధినే కొనసాగిస్తారా సమాధానం చెప్పాలన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో పిట్టల దొరలకు చోటు లేకుండా చేశామన్నారు. అధికారం ఉన్నా.. లేకున్నా జనం కోసం నిలబడిన వారినే రాయలసీమలో 'మొగోడు' అంటారన్నారు. తాగునీరు లేక పల్లెల గొంతెండుతున్నా.. గొంతులు కోసే రాజకీయాలు చేసిన వారిని ప్రజలు మరిచిపోరన్నారు. బుగ్గనకు టికెట్టు వస్తుందా అని విమర్శించిన వారే.. నేడు టిక్కెటు కోసం అల్లాడే పరిస్థితి వచ్చిందన్నారు.

అభివృద్ధి అంటే ఏమిటో వారికి తెలియదు

అభివృద్ధి పనులకు పునాదిరాయి కూడా వేయని విపక్ష నాయకులు తనపై చేస్తున్న విమర్శలు అర్థరహితమని ఆర్థిక శాఖ మంత్రి అన్నారు. అత్యాధునికంగా ఏర్పాటు చేసి పఫ్ షీట్ల విలువ తెలియక పోవడం వారి అవగాహనా రాహిత్యమన్నారు. వివిధ లేయర్లతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఈ షీట్లతో ఉష్ణోగ్రత తగ్గడమే కాకుండా ఎక్కువ కాలం మన్నిక ఉంటాయన్నారు. స్లాబ్‌లకన్నా ఎక్కువ మొత్తం ఖర్చు పెట్టి డోన్ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రత్యేక అకృతులతో నిర్మాణాలు చేపట్టినట్లు మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా గుడి, బడి, ఆసుపత్రి, రోడ్లను అభివృద్ధి చేస్తే.. ఇదేమి అభివృద్ధి అంటున్న స్వార్థ ప్రతిపక్ష నాయకులు డోన్ ప్రజలకు అవసరమా అని మంత్రి ప్రశ్నించారు. ఎంబాయిని బొంబాయి చేస్తామని చెప్పి ఏమీ చేయలేకపోయారన్నారు. బేతంచెర్లలోని గోరుమానుకొండను విద్యాలయాల నిర్మాణాలతో లండన్‌లా మార్చుతున్నామని, మంచికి పట్టం కట్టాలని ప్రజలను కోరారు.

బీసీలకు పెద్ద పీట

వైఎస్సార్‌సీపీ బీసీలకు పెద్ద పీట వేస్తోందని ఆర్థిక శాఖ మంత్రి తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయల సైన్యంలో వాల్మీకులు సమరయోధులని, తరతరాలుగా వారు అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొదటిసారిగా వాల్మీకి భవన్ నిర్మించామన్నారు. బీసీల పేరుతో ఫ్యాక్షన్ రాజకీయాలు చేసి ఏ ఒక్క బీసీకైనా ఉపయోగపడే ఒక్క పనైనా చేశారా చెప్పాలని కోట్ల, కేఈని మంత్రి ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్లు ముర్తుజావలీ, ఖాజా, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బాబ్ రెడ్డి, మద్దిలేటి స్వామి చైర్మన్ రామచంద్రుడు, వాల్మీకి నాయకులు బలరాముడు, రంగస్వామి, తిమ్మగురుడు, తిమ్మయ్య, కేశాలు, పరమేష్ ,మల్లీ, నిరంజన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, సురేంద్రనాథ్ రెడ్డి , నాగేశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి



మృతి చెందిన రామాంజనేయులు

డోన్ టౌన్: పట్టణంలో ఓ భవన నిర్మాణ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయులు (32) గురువారం ఓ ప్రైవేటు వెంచర్‌లో భవన నిర్మాణం పనులకు వెళ్లాడు. అక్కడ అతని చేతిలో ఉన్న ఇనుప కడ్డీ ప్రమాదవశాత్తూ ఇంటి పక్కనే ఉన్న విద్యుత్ తీగకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న మరో కార్మికుడు పట్టణానికి చెందిన ఓబులేసు చేతికి గాయాలయ్యాయి. మృతుని భార్య శిరీష ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యాన్ని మించి 'ఉపాధి' పనులు

కర్నూలు(అగ్రికల్చర్): లక్ష్యాన్ని మించి ఉపాధి పనులు కల్పించినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఆర్థిక సంవత్సరంలో 95.70 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 96,22,187 పనిదినాలు కల్పించామన్నారు. పని దినాలు కల్పించడంలో ఆదోని, హొళగొంద మండలాలు మొదటి స్థానంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఆదోని మండలంలో 6 లక్షల పని దినాలు కల్పించాలనేది లక్ష్యమయితే, 6.96 లక్షల పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. హొళగొంద మండలంలో 3.30 లక్షల పనిదినాలు కల్పించాలనేది లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 3,78,366 పనిదినాలు కల్పించినట్లు చెప్పారు. ఆలూరు, మద్దికెర, పత్తికొండ, కౌతాళం, మంత్రాలయం, హాలహర్వి, వెల్దుర్తి, కోసిగి మండలాల్లో లక్ష్యానికి మించి పనిదినాలు కల్పించినట్లు తెలిపారు. 2023–24లో రికార్డు స్థాయిలో కోటి పనిదినాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎస్సీలకు 61,765 జాబ్ కార్డులు ఉండగా 44,626 కుటుంబాలు, ఎస్టీలకు 3,997 జాబ్‌కార్డులు ఉండగా 3,051 కుటుంబాలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 15,496 కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించామని, 60 నుంచి 99 రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలకు 100 రోజుల పని దినాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు పేర్కొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఉయ్యాలవాడ: కొండుపల్లె గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ నూర్ అహమ్మద్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బాల అయ్యపురెడ్డి(72) అప్పులు, అనారోగ్య సమస్యలతో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శరీరంపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు తాళలేక కేకలు వేయడంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పారు. తీవ్రంగా గాయపడిన వృద్ధుడిని 108లో నంద్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మమ్మ, కుమారుడు వెంకటకృష్ణారెడ్డి ఉన్నారని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జోడు వైభవం.. భక్తి పారవశ్యం



భక్తుల జయ జయ ధ్వానాలు హోరెత్తగా.. గొరవయ్యల నృత్యం చేస్తుండగా గూళ్యం గ్రామంలో గురువారం జోడు రథోత్సవం కనుల పండువగా సాగింది. గురుశిష్యులైన సిద్దేశ్వర, గాది లింగేశ్వర స్వాముల జోడు రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. – హాలహర్వి